క్లుప్తంగా

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న అధ్యాపకురాలు సుజన

పుత్తూరు: ప్రకృతి సహజ సంపదైన అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుజన అన్నారు. శుక్రవారం కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య అధ్యక్షతన అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మానవాళి మనుగడ అడవుల సంరక్షణపై ఆధారపడి ఉందన్నారు. అటవీ సంపద తరిగిపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాబు, తహసీల్దార్

వెదురుకుప్పం: మండల తహసీల్దార్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. అనంతరం వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. రైతుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు.

ఆకట్టుకునేలా విద్యాబోధన



మాట్లాడుతున్న సీడీపీఓ వినత శ్రీ

గంగాధర నెల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను ఆకట్టుకునేలా విద్యాబోధన చేయాలని సీడీపీఓ వినతశ్రీ ఆదేశించారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పీహెచ్‌సీ అభివృద్ధి



మాట్లాడుతున్న శివప్రకాష్‌రాజు

పాలసముద్రం: సమష్టి కృషితోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి సాధ్యమని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్‌రాజు కోరారు. శుక్రవారం పీహెచ్‌సీలో వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. శివప్రకాష్ రాజు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి పాల్గొన్నారు.

గ్రహణమొర్రిపై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా బాలల సంరక్షణ కేంద్రంలో శుక్రవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్(గ్రహణ మొర్రి) దినోత్సవాన్ని నిర్వహించారు. డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లల తల్లిదండ్రులకు పెదాల చీలికపై అవగాహన కల్పించారు. ఈ సమస్యను ప్రభుత్వం తరపున చికిత్స అందిస్తున్నామని చెప్పారు.

పన్ను వసూళ్లు పరువు నిలిపేనా?





పన్ను వసూలు చేస్తున్న సచివాలయ సిబ్బంది

- వసూళ్లలో చివరి స్థానం ఇకనైనా మారేనా..?
- పన్నుల వేటలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు
- 8 రోజుల్లో ముగియనున్న గడువు
- వసూలు కావలసిన బకాయిలు రూ. 2.29 కోట్లు

నగరి: పన్ను వసూళ్లలో తన స్థానం చివరిదే అంటూ పలుమార్లు నగరి మున్సిపాలిటీ చాటుకుంది. మున్సిపాలిటీ నిర్వహణకు పన్నులే ఆధారం. మున్సిపాలిటీకి అవి జీవం లాంటింది. అయితే మున్సిపాలిటీ ఏర్పడిన సమయంలో వచ్చిన వివాదాలు పన్ను వసూలుకు అవరోధాలుగా మారడంతో నాటి నుంచి పన్ను వసూళ్లలో నగరి మున్సిపాలిటీ చివరి స్థానంలో నిలుస్తోంది. ప్రస్తుత ఏడాది బకాయి ఉన్న పన్ను వసూళ్లలోనూ రెండు రోజుల ముందు వరకు జిల్లాలోని చిత్తూరు మున్సిపాలిటీ 16.97 కోట్లు పన్ను వసూలు చేస్తే, పుంగనూరు 4.48 కోట్లు, పలమనేరు 3.16 కోట్లు, కుప్పం 2.51 కోట్లు వసూలు చేయగా నగరి 2.35 కోట్లు వసూలు చేసి చివరిస్థానంలో నిలిచింది. అయితే పన్ను వసూలు శాతంలో నగరి ముందంజలోనే ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. బకాయి ఉన్న మొత్తం అందులో వసూలు చేసిన మొత్తాన్ని బేరీజు వేసుకుంటే 64 శాతం వసూలు చేసి పలమనేరు తొలిస్థానం, 62 శాతం వసూళ్లతో పుంగనూరు రెండవ స్థానం, 52 శాతం వసూళ్లతో నగరి మూడవ స్థానంలో ఉన్నట్లు పేర్కొంటున్నారు.

పన్ను వసూళ్లలో పెరిగిన వేగం

మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్నుకు సంబంధించి 14,671 అసెస్‌మెంట్‌లు ఉండగా వాటి ద్వారా ప్రస్తుత ఏడాదికి రావలసిన పన్ను రూ. 3.16 కోట్లు, నీటిపన్నుకు సంబంధించి 5723 అసెస్‌మెంట్లు ఉండగా వాటి ద్వారా రావలసిన పన్ను రూ. 68.58 లక్షలు. అంటే ఏడాదికి పన్నుల ద్వారా 3.84 కోట్లు వసూలు రావాలి. అయితే ఇప్పటి వరకు వసూలైన ఆస్తిపన్ను రూ. 1.60 కోట్లు కాగా, నీటి పన్ను రూ.15.65 లక్షలు మాత్రమే. ఈ ఏడాదికి పన్నుల ద్వారా ఇంకా వసూలు కావలసిన పన్నులు పాత బకాయిలు కలిపితే రూ. 4.80 కోట్లు ఉంటోంది. ఇందులో ఇప్పటి వరకు రూ. 2.51 కోట్లు వసూలైంది. ఇంకనూ రూ. 2.29 కోట్లు బకాయి ఉంది. ఈ పన్ను వసూలుకు 8 రోజులే గడువు ఉండడంతో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక కార్యాచరణకు ఉపక్రమించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పన్ను వసూళ్లు చేస్తున్నారు.

మున్సిపాలిటీ చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలోనే..

మున్సిపాలిటీ ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా కోట్లలోనే ఉంది. మున్సిపాలిటీ చెల్లించాల్సిన విద్యుత్ బిల్లు రూ.6.70 కోట్లు ఉంది. మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనులకు సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సిన బిల్లులు కూడా అధికంగా ఉన్నాయి. దీంతో మున్సిపల్ అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. పన్నులు వసూలు అయితే ఈ బకాయిలను కూడా విడతలవారీగా మున్సిపాలిటీ చెల్లించేందుకు వీలుంటుంది.

పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు



పన్నుల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పన్ను కట్టకుంటే వారికి భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను వివరించడంతో పన్ను కట్టడానికి నివాసితులు ముందుకు వస్తున్నారు. పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు నోటీసులు ఇస్తున్నాం. పూర్తి స్థాయిలో పన్నులు వసూలైతేనే మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధికి అవరోధాలు ఉండవు.

–కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ

నోటీస్ బోర్డు

నేడు పీ–4పై వార్డు సభలు

పుత్తూరు: పీ–4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్) సర్వేలో ఏదైనా మార్పులు–చేర్పులు చేసుకోదల్చిన వారు శనివారం నిర్వహించే వార్డు సభల్లో సవరణలతో పాటు నూతన నమోదులు సైతం చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ గౌడ్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 11 పల్లూరు, రాచపాళెం, సత్యనారాయణ కాలనీ, పిళ్లారిపట్టు, దాసరిగుంట, గోవిందపాళెం, నందిమంగళం, ఎన్‌జీఓ కాలనీలోని సచివాలయాల వద్ద, మధ్యాహ్నం 3 గంటలకు కళ్యాణపురం, ఆరేటమ్మ కాలనీ, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీనగర్, అంబేడ్కర్ సర్కిల్ సచివాలయాల వద్ద వార్డు సభలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న ఉష

గంగాధరనెల్లూరు: బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా కృషి చేయాలని మహిళా, శిశు సంక్షేమ ప్రొటెక్షన్ సభ్యులు షణ్ముగం, ఉష, ఉమాదేవి, మురళి కోరారు. శుక్రవారం ముక్కలతూరు ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణ , బాల్యవివాహాలను అరికట్టడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లోకనాథం , సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి శోభ పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



కుశస్థలి నదిలో ఇసుక తీస్తున్న దృశ్యం

- సరిహద్దుకు దాటిస్తున్న కూటమి నాయకులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సహజ సంపదలను అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాతో జేబులు నింపుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాతో కుశస్థలి నది రూపురేఖలు మారుతోంది. భూగర్భ జలాల మట్టం పడిపోతోంది. అలాగే గ్రావెల్ అక్రమ రవాణా ధాటికి కొండలు కూడా కరిగిపోతున్నాయి.

విజయపురం: కేవీపురం కుశస్థలి నది నుంచి రోజూ ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రేయింబవళ్లూ దర్జాగా ఇసుక తరలిస్తూ కాసుల పంట పండిస్తున్నారు. కేవీపురానికి సంబంధించి ఎలాంటి రీచ్ అనుమతులు లేకపోయినా అధికారం అడ్డుపెట్టుకుని స్థానిక టీడీపీ నేతలు పెద్ద మొత్తంలో ఇసుక రవాణా చేస్తున్నారు. నిత్యం వందలాది లోడ్ల ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా పోలీసులు, రెవెన్యూ, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం ట్రాక్టర్లతో రవాణా చేస్తున్న నాయకులు త్వరలో టిప్పర్లతో కూడా రవాణాకు స్కెచ్ వేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం మండలంలో ప్రభుత్వ పనులు ఎక్కడా జరగడం లేదు. ఇళ్ల నిర్మాణం కూడా ఆశించిన స్థాయిలో చేయకున్నా కేవీపురంలోని కొందరు టీడీపీ నాయకులు రహస్య ప్రాంతాల్లో ఇసుక డంపింగ్ చేసి, రాత్రి పూట సరిహద్దులు తరలిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా దీనిపై దృష్టి సారించి, కుశస్థలి నది నుంచి అక్రమంగా ఇసుక రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

భక్తులకు అన్నదానం



నగరి: మున్సిపల్ పరిధి కీళపట్టు త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో భక్తులకు శుక్రవారం అన్నదానం చేశారు. శ్రీవోందేవి 57వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కీళపట్టు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమానికి కూరగాయలను వితరణగా అందజేశారు. వలంటీర్లుగా పనిచేసిన వారికి ఆలయ నిర్వాహకులు రుద్రాక్షలను బహూకరించారు.

జగనన్న కాలనీని పరిశీలించిన ఆర్డీఓ



కేవీపురంలో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

విజయపురం: మండలంలోని కేవీపురం దళితవాడకు చెందిన జగనన్న కాలనీని నగరి ఆర్డీఓ భవానీ శంకరి శుక్రవారం పరిశీలించారు. గత ప్రభుత్వం కేవీపురం దళితవాడ చెందిన 78 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను చూపడంలో స్థానిక అధికారులు జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో సీపీఐ నేతల ఆధ్వర్యంలో లబ్ధిదారులు పలుమార్లు ధర్నా, ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ స్పందించారు. జగనన్న కాలనీని పరిశీలించారు. అక్కడి పరిస్థితులను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. అర్హత కలిగిన వారికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సీపీఐ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టెక్నాలజీపై పట్టు అవసరం



మాట్లాడుతున్న చైర్మన్ రంగనాథం

చిత్తూరు కలెక్టరేట్: ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీపై పట్టు ముఖ్యమని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రంగనాథం అన్నారు. నగరంలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రెండు రోజుల జాతీయ స్థాయి సింపోజియంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరిలో ఖచ్చితంగా ప్రతిభ ఉంటుందన్నారు. ఆ ప్రతిభను గుర్తించి జీవితంలో రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ రామకృష్ణారావు, సెక్రటరీ బద్రినారాయణ, ప్రిన్సిపల్ వెంకటాచలపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవన జ్యోతి అన్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒకే దేశం–ఒకే ఎన్నికలు అనే అంశంపై ప్రసంగించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే అన్ని పోటీల్లో పాల్గొనడం అలవాటు చేసుకోవాలన్నారు. పోటీతత్వం వల్ల జీవితంలో రాణించగలరని తెలిపారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, కుంగిపోకుండా ముందుకు సాగాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, సావిత్రమ్మ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, యువజన అధికారి ప్రదీప్, సమన్వయ కర్త సుశీల భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్‌కు వేధింపులు

చిత్తూరు కార్పొరేషన్: అంగన్‌వాడీ వర్కర్‌ను అధికారులు వేధించడం మానుకోవాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిపురం ప్రాజెక్టు కొలమడుగు అంగన్‌వాడీ వర్కర్ స్వాతిపై రాజకీయ ఒత్తిళ్ల మేరకు మెమోలు ఇస్తున్నారని విమర్శించారు. ఆమెను మానసికంగా ఇబ్బంది పెట్టడానికి ఇలా చేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని గతంలో చంద్రబాబు హామీ నిచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలో వచ్చాక వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమెకు రెండు మెమోలు ఇచ్చారని మూడోది ఇచ్చి తొలగిస్తామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై స్వాతి అధికారులను ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆమె చావే శరణ్యమని యూనియన్ నాయకుల వద్ద బోరున విలపించిందని చెప్పారు.

ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీలోని ఎస్‌ఎస్ పురం సమీపంలోని కాటన్ మిల్ వద్ద ఉన్న రేణిగుంట–పుత్తూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలంలో శుక్రవారం అక్రమ కట్టడాలు నిర్మించడంతో ఆగ్రహించిన గ్రామస్తులు కట్టడాలను ఆపేయాలని నిలదీశారు. ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరగడంతో మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. స్థలం సమస్య అయినందున రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలపడంతో మహిళలు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్వో మల్లికార్జున్ సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు స్థలంలో నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయించారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరూ నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని వీఆర్వో తెలిపారు.

కంకర దోపిడీ చేస్తున్నారు !

సత్యవేడు: మండలంలోని చమర్తిర్తికండ్రిగలోని క్వారీల నుంచి అధిక లోడ్‌తో కంకర తరలిస్తూ దోపిడీ చేస్తున్నారని టీడీపీకి చెందిన చెంగయ్య ఆరోపించారు. శుక్రవారం గ్రామం నడివీధిలో నిరసన తెలిపి, కంకర లారీలను అడ్డుకున్నారు. ప్రభుత్వం కంకర దోపిడీని అరికట్టాలని, ఈ టిప్పర్లతో పాడైన రోడ్డును మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చమర్తి కండ్రిగలో నడుస్తున్న క్వారీల నుంచి టిప్పర్లలో అధిక లోడ్‌తో కంకర తరలిస్తుండడంతో పాండూరు– నాగలాపురం రోడ్డు గుంతమయమైందన్నారు. ద్విచక్రవాహనచోదకులు రా త్రి వేళ ప్రయాణం ప్రమాదకరంగా మారిందన్నారు. రోజు వందల సంఖ్యలో టిప్పర్లు తమిళనాడుకు కంకర తరలిస్తుండడంతో టిప్పర్లు నుంచి వస్తున్న దుమ్ము బాటసారులపై పడుతోందన్నారు. రోజు క్వారీ యజమానులు రోడ్డుపై దుమ్ములేయకుండా ట్రాక్టర్లు ద్వారా నీటిని చల్లాలని డిమాండ్ చేశారు. కంకర లారీలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకుపోతామన్నారు. ప్రజలు ఇబ్బందులు ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లేందుకే నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు.



చమర్తికండ్రిగ వద్ద టిప్పర్‌ను అడ్డుకుని నిరసన తెలుపుతున్న చెంగయ్య

సేవలు కుయ్యో.. మొర్రో..!

- ప్రమాదం జరిగితే 108 అంబులెన్సు వచ్చే వరకూ డౌటే
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- పట్టించుకోని పాలకులు
- అప్పలాయిగుంటలో 108 వాహనం అత్యవసరం



గాయపడిన ఏఎస్‌ఐ గురుస్వామి (ఫైల్)



108 అంబులెన్సు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం అప్పలాయిగుంటలో ప్రసిద్ధి చెందిన శ్రీప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయం ఉంది. ఇక్కడికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనార్థం వస్తూంటారు. శని, ఆదివారాల్లో సుమారు 25వేల మంది వస్తారు.. ఇంత ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంలో అంబులెన్స్, 108 వాహనం లేకపోవడం శాపంగా మారింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సరైన సమయంలో వైద్యం అందక ప్రజలు మృత్యువాత పడుతున్నారు.

రైల్వే గేటే శాపమా..?

వడమాలపేట మండలం 22 పంచాయతీలు, 20వేలకు పైగా జనాభా కలిగి ఉంది. అప్పలాయిగుంట చుట్టూ 50 వరకూ గ్రామాలు ఉన్నాయి. మండలంలో అత్యవసర పరిస్థితిలో వైద్యసేవలు అందించడానికి వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ 108 అంబులెన్సు ఉంది. అయితే తడుకు ఆర్‌ఎస్, పూడి వద్ద రైల్వే గేటు ఉండటం 12 పంచాయతీలకు శాపంగా మారింది. ఈ ప్రాంతాల్లో ప్రమాదం జరిగి గంటన్నర అయితేగానీ 108 సంఘటన స్థలానికి చేరుకోవడం లేదు. ఈ లోపు ప్రమాదానికి గురైన వ్యక్తులు మృత్యువాత పడుతున్నారు.

- ఇటీవల శివరాత్రి రోజు ఓ రిటైర్డ్ ఏఎస్‌ఐ గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న వడమాలపేట నుంచి 108 రావడానికి గంట పట్టింది. ఈ లోపు ఆటోలో తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.
- అలాగే వడమాలపేట ఏఎస్‌ఐ గురుస్వామి తన స్నేహితుడు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తూ ద్విచక్రవాహనం నుంచి కింద పడి తలకు తీవ్రగాయమైంది. స్థానికులు స్పందించి వెంటనే 108కు ఫోన్ చేశారు. 108 రావడానికి గంటన్నర పట్టింది. అంతలోనే ఆయన మృతి చెందాడు.

వైఎస్‌ఆర్ సజీవుడు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2005 ఆగస్టు 15న 108 వాహనాల సేవలు ప్రారంభించారు. తొలుత ఎనిమిది వాహనాలను వైఎస్‌ఆర్ ప్రారంభించి, 2007వ సంవత్సరం వచ్చేసరికి వీటి సంఖ్య 375కు చేరింది. 2014లో రాష్ట్ర విభజన జరిగే నాటికి ఉమ్మడి రాష్ట్రంలో 820 వాహనాలు ఉండగా వీటిలో 445 వాహనాలను ఏపీకి కేటాయించారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండలానికి ఒక వాహనం ఉండాలని 104, 108 వాహనాలను వెయ్యి వరకు పెంచారు.

అందరూ ఆరోగ్యంగా జీవించాలి



వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

యాదమరి: గ్రామీణ ప్రాంతంలోని అందరూ ఆరోగ్యంగా జీవించాలని శుచి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేతలు పాల్ విజయ్, గ్లోరి విజయకుమార్ తెలిపారు. వారు మండల పరిధి జోడిచింతలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవసరమైన వైద్య సేవలు తమ సంస్థచే అందిస్తున్నామన్నారు. వేలూరు సీఎంసీ వైద్య సిబ్బందితో మండలంలోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు చేస్తున్నామన్నారు. శిబిరంలో 120 మందికి చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ వైద్య సిబ్బంది, శుచి సంస్థ సిబ్బంది శాంసన్, ఆనందకుమార్, చిన్నయ్య, ధనలక్ష్మి, వరదరాజులు, జాకబ్ జాన్సన్ పాల్గొన్నారు.